తొలి క్రాంతి NEWS

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
శనివారం
19-4-2025
వెల రూ. 4/-
పేజీలు 04



2

## గ్రూప్-1 పరీక్షను
# రద్దు చేయండి

- ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీ లోపించింది
- నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆక్షేపనీయం
- తిరిగి నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించాలి
- తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అనేక లోపాలు, అవకతవకలపై అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ధర్మబద్ధమైనవేనని పేర్కొన్నారు. పరీక్షల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆక్షేపనీయమని ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీ లోపించింది అని విమర్శించారు.

# ఏఐ డేటా సెంటర్

## రూ.10,500 కోట్ల సూపర్ డీల్



- టెక్ రెవల్యూషన్‌కు ఇది ఓ గేమ్ ఛేంజర్
- 25000 జీపీయూలతో శక్తివంతమైన సూపర్ కంప్యూటింగ్ క్లస్టర్
- టెక్ దిగ్గజాలు ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ పెట్టుబడులు
- హైదరాబాద్ డేటా సెంటర్ హబ్‌గా మరింత బలోపేతం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్ల భారీ పెట్టుబడితో సూపర్ డీల్ సాధించింది.టెక్ రెవల్యూషన్‌కు ఇది ఓ "గేమ్ ఛేంజర్ గా నిలవనుంది డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సేవల్లో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఎన్‌టీటీ డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ లు సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్‌ను నిర్మించేందుకు త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది.



## ఇక మిలిగినవి నాలుగు జిల్లాలే

2

- దేశానికి విముక్తి కలిగించాలనే కృతనిశ్చయంతో కేంద్రం ఉంది
- నక్సల్ లొంగిపోవాలి
- కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా



## పేదల సంక్షేమానికే
# భూభారతి

- వందేళ్లకూ ఉపయోగపడేలా రూపొందించా
- సుమారు 23 వేల మందిని నడిరోడ్డుపై పడేసిన దొర కేసీఆర్
- 2020లో ధరణి చట్టం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి అయినా రెవెన్యూ సదస్సు నిర్వహించిందా?
- భూభారతి పైలెట్ ప్రాజెక్టు ను ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2



## బీజేపీకి మతం తప్ప అభివృద్ధి తెలవదు

- ఇంకెంతకాలం రజాకార్ల ముచ్చట్లు చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడతారు
- బీజేపీ పాలనలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నారా
- దమ్ముంటే మెట్రో విస్తరణకు అనుమతులు తీసుకురావాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

2

## జీహుజూర్ అంటున్న ఆ పార్టీలు

- ప్రజల రక్తం తాగిన పార్టీ
- మజ్లిస్ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదు
- కేంద్ర మంత్రి అధ్యక్షుడు కిషన్ రెడ్డి

## రేవంత్ మౌనం ఎందుకు?

2

- నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌తో సోనియా, రాహుల్ పేర్లు
- దేశవ్యాప్త నిరసనలు చేస్తుంటే..
- మీరెందుకు స్పందించడం లేదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



## రూ.2 వేల కోట్లు కాజేసే యత్నం



- తప్పు చేసిన వారు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- న్యాయస్థానాలపై సడలుతున్న నమ్మకం
- ఈ దేశ చట్టాలు సోనియాకు, రాహుల్ గాంధీకి వర్తించవా?
- కేంద్రమంత్రి బండి సంజయ్

2


# 33 శాతం సీట్లు మీకే

దేశంలో త్వరలోనే మహిళా బిల్లు రాబోతున్నదని..బిల్లుతో మహిళలకు 33 శాతం సీట్లు వస్తాయని చెప్పారు.రాబోవు రోజుల్లో మహిళలంతా ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. రాజకీయాల్లో ప్రత్యక్షంగా తిరిగే మహిళలకే అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటి నుంచే నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. మహిళా బిల్లుతో రాష్ట్రంలో పార్టీ తరఫున 33 శాతం సీట్లు కేటాయిస్తామని.. నాయకుల భార్యలకు కాకుండా పార్టీలో యాక్టివ్‌గా పనిచేస్తున్న వారికే సీట్లు ఇస్తామని కేసీఆర్ చెప్పారు.



- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- రాజకీయాల్లో ప్రత్యక్షంగా తిరిగే మహిళలకే అవకాశాలు లభిస్తాయి
- మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సభ విజయవంతంలో వారి పాత్ర కీలకం
- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

2



# గ్రూప్-1 పరీక్షను రద్దు చేయండి

**- తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 18 (తొలి క్రాంతి): తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసి పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అనేక లోపాలు, అవకతవకలపై అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ధర్మబద్ధమైనవేనని పేర్కొన్నారు. పరీక్షల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆక్షేపనీయమని ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీ లోపించింది అని విమర్శించారు.**



ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్‌టికెట్లను జారీచేయడం, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో అనాసక్తమైన మార్పులు, రెండు పరీక్ష కేంద్రాల నుంచి 71 మంది అభ్యర్థులు ఎంపికవ్వడం వంటి అంశాలపై అభ్యర్థుల్లో తీవ్ర సందేహాలు నెలకొన్నాయని తెలిపారు. టీజీపీఎస్సీ మొదట 21,075 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని చెప్పి, ఫలితాల విడుదల సమయంలో ఆ సంఖ్య 21,085గా పేర్కొనడం, ఉర్దూ మీడియం అభ్యర్థుల సంఖ్య 9 నుంచి 10కి పెరగడం వంటి గందరగోళాలను ఉదహరించారు. జవాబు పత్రాల మూల్యాంకనం రిటైర్డ్ ప్రొఫెసర్ల చేత చేయడం కూడా అనుమానాలకు తావిస్తోందని, టీజీపీఎస్సీ తొలుత ప్రఖ్యాత యూనివర్సిటీల ప్రొఫెసర్లతో విలువయేషన్ చేస్తామని చెప్పినప్పటికీ దాన్ని పాటించలేదని విమర్శించారు. గ్రూప్-1 పరీక్షలపై అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు, తుది ఆదేశాలు వచ్చే వరకు నియామక పత్రాలు జారీ చేయొద్దని ఆదేశించిందన్నారు. ఇది అభ్యర్థుల ఆందోళనకు న్యాయబద్ధత కల్పించిందని ఆమె పేర్కొన్నారు.

"నీళ్లు - నిధులు -నియామకాలు" తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యమని గుర్తు చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గ్రూప్-1 పరీక్షల తీరుపై ఉన్న అనేక అనుమానాల నేపథ్యంలో ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనను సహృదయంతో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బీజేపీకి మతం తప్ప అభివృద్ధి తెలవదు

**- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ నాయకులకు మతం తప్ప అభివృద్ధి అనే మాటే తెలియదని ధ్వజమెత్తారు. "ఇంకెంతకాలం రజాకార్ల ముచ్చట్లు చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడతారు?" అంటూ ప్రశ్నించారు. బీజేపీ పాలనలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నారా అని నిలదీశారు. తెలంగాణ బీజేపీ నేతలకు రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత లేకపోయినా, మతాలు మరియు కులాల పేరుతో రాజకీయాలు చేయడం బాగా వచ్చిందని ఎద్దేవా చేశారు. దేశంలోని పలు నగరాల్లో మెట్రో సేవలు విస్తరిస్తున్నా, తెలంగాణలో మాత్రం ఈ ప్రాజెక్టు ముందుకెళ్లకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దమ్ముంటే కేంద్రం నుంచి మెట్రో విస్తరణకు అనుమతులు తీసుకురావాలి బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. రాష్ట్రాభివృద్ధి తమకు ఇష్టముండకపోవడం వల్లే ప్రతి అంశానికి అడ్డుపడుతున్నారని విమర్శించారు.

## జీహుజూర్ అంటున్న ఆ పార్టీలు

**- కేంద్ర మంత్రి అధ్యక్షుడు కిషన్ రెడ్డి**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): భాగ్యనగర స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతంరావును గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బేగంపేట్ లోని హరిత ప్లాజాలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు బీజేపీని విమర్శించే నైతికహక్కు లేదన్నారు. మజ్లిస్ పార్టీ ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి, ప్రజల్ని దోచుకున్న, రక్తం తాగిన పార్టీగా విమర్శించారు. హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ చేయకుండా మజ్లిస్ పార్టీకి 'జీహుజూర్' అంటూ చేతులెత్తి సలాం కొడుతున్నారన్న ఆయన, ప్రజలకు దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ మూడు పార్టీలు వేరే వేరే ముక్కలుగా కనిపించినా, వాస్తవానికి ఒక్కటేనని ఆరోపించారు. మజ్లిస్ కు విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన పార్టీ అయిన మజ్లిస్ కు వ్యతిరేకంగా బీజేపీ జాతీయవాద భావజాలంతో పోటీ చేస్తుందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తుందని తెలిపారు. మజ్లిస్ మతోన్మాదం, గూండాయిజాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు.

బీజేపీ కేవలం పాతబస్తీలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో విస్తరిస్తోందని చెప్పారు. పాతబస్తీలో హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకొని ఖాళీ చేయించిన అనేక ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. అలాంటి మజ్లిస్ తో కుమ్మక్కై తెలంగాణను బలిచేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లను ప్రజలు బోధించాల్సిన సమయం వచ్చిందన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా తయారైందని వీధిలైట్లు కొనేందుకు కూడా నగరానికి డబ్బుల్లేని పరిస్థితి అని అన్నారు. బీఆర్ఎస్ హైటెక్ సిటీలో మాత్రమే రంగులు వేసి అభివృద్ధి చేసినట్టుగా ప్రచారం చేస్తోందని, కానీ ఇతర ప్రాంతాల్లోఅంబర్ పేట్, మల్కాజ్ గిరి, దిల్ సుఖ్ నగర్, చార్మినార్, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లో అభివృద్ధి అవసరం ఉందన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశం విద్యుత్ కోతలేని దేశంగా మారిందని ఆర్థిక, పన్నుల సంస్కరణలు, ఉగ్రవాద నిర్మూలన, విదేశాంగ విధానాల్లో ప్రగతిని సాధించిందని చెప్పారు. తెలంగాణలో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం వచ్చినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఏఐ డేటా సెంటర్

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్ల భారీ పెట్టుబడితో సూపర్ డీల్ సాధించింది.టెక్ రెవల్యూషన్‌కు ఇది ఓ "గేమ్ ఛేంజర్ గా నిలవనుంది డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సేవల్లో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఎన్‌టీటీ డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ లు సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్‌ను నిర్మించేందుకు త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది.

టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్‌ల నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా , డైరెక్టర్ తడావోకి నిషిమురా , ఎన్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్ , నెయిసా సీఈవో, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ శరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో 400 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ నిర్మితమవుతుంది. 25,000 జీపీయూలతో భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్‌కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఈ క్లస్టర్ అందిస్తుంది. తెలంగాణను దేశంలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందుతోంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ-ఆధారిత సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ ఆవిష్కరణల కేంద్రంగా నిలుస్తుంది.

ఈ ఏఐ డేటా సెంటర్ క్లస్టర్‌ను 500 మెగావాట్ల వరకు గ్రిడ్ విద్యుత్‌తో, మిగిలినది పునరుత్పాదక శక్తి ద్వారా నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్టును ఉన్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యంతో ఈ క్యాంపస్ ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పెట్టుబడి ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ప్రతిభావంతులైన నిపుణులు ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపాయన్నారు.

ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టులతో పాటు, ఎన్‌టీటీ డేటా భారీ పెట్టుబడి ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా మరింత బలపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ప్రముఖ సంస్థ. 50కి పైగా దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా నిలుస్తుంది. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం రంగాలకు సేవలు అందిస్తుంది. నెయిసా నెట్‌వర్క్, ఏఐ-ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థగా, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌పై దృష్టి సారిస్తుంది.

## రూ.2 వేల కోట్లు కాజేసే యత్నం

**- కేంద్రమంత్రి బండి సంజయ్**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ నేతలు నిర్వహించిన నేషనల్ హెరాల్డ్ కేసు సంబంధిత ధర్నాపై స్పందిం చారు. ఆయన మాట్లాడుతూ, తప్పు చేసిన వారు బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారని, న్యాయస్థానాలపై ప్రజలకు నమ్మకం సడలిపోతుందని అన్నారు. ఈ దేశ చట్టాలు సోనియాకు, రాహుల్ గాంధీకి వర్తించవా? అని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ దేశ సంపదను దోచుకునేం దుకు ప్రయత్నించిందని ఆరోపించారు. దాదాపు రూ.2 వేల కోట్ల ప్రభుత్వ సంపదను కాజేసే ప్రయత్నం జరిగింది అని హాట్ కామెంట్స్ చేశారు. ఈ కేసు బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదలైనదీ కాదని, 2011లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే సీబీఐ దర్యాప్తు ప్రారంభమైందని గుర్తు చేశారు. అప్పటికే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ కేసులో బెయిల్ పొందారని తెలిపారు. బీజేపీకి ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## మిలిగినవి నాలుగు జిల్లాలే

**- కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా**

న్యూఢిల్లీ ఏప్రిల్18(తొలి క్రాంతి): అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ సాధ్యమైనంత త్వరగా లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు మరోసారి పిలుపునిచ్చారు. 2026 మార్చి 31 కల్లా నక్సల్స్ బెడద నుంచి దేశానికి విముక్తి కలిగించాలనే కృతనిశ్చయంతో కేంద్రం ఉందని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో 22 మంది మావోయిస్టులను కోబ్రా కమెండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారని, వారి నుంచి అధునాతన ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారని అమిత్‌షా తెలిపారు. 11 మంది మావోయిస్టులు కూడా సుక్మా జిల్లా బడేసేటీ పంచాయతీలో లొంగిపోయారని, దీంతో నక్సల్స్ బెడద నుంచి ఆ పంచాయతీకి విముక్తి లభించిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అమిత్‌షా తెలిపారు.

కాగా, దీనికి ముందు మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో గురువారం జరిగిన సీఆర్‌పీఎఫ్ రైజింగ్ డే కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం నాలుగు జిల్లాలకే నక్సల్స్ పరిమితమయ్యారని చెప్పారు. ప్రధానమంత్రి చెప్పినట్టుగా 2026 మార్చి 31వ తేదీ కంటే ముందే దేశానికి నక్సల్స్ బెడద నుంచి విముక్తి కల్పించేందుకు పట్టుదలగా ఉన్నామని తెలిపారు. ఈ దిశగా జరుపుతున్న పోరాటంలో సీఏపీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 400కు పైగా ఫార్వార్డ్ అపరేషన్ బేస్‌లను సీఆర్‌పీఎఫ్ ఏర్పాటు చేసిందని, దీంతో ఈ ప్రాంతాల్లో 70 శాతానికి పైగా హింసాత్మక ఘటనలు తగ్గిపోయాయని, ఇప్పుడు దీనికి ముగింపు పలకనున్నామని చెప్పారు.



## పేదల సంక్షేమానికే భూ భారతి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

ములుగు ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): ములుగు జిల్లా వెంకటాపురంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టుని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క ప్రారంభించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు, పేదల సంక్షేమం కోసం కొత్త భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్టు తెలిపారు. పొంగులేటి ధరణిని తీవ్రంగా విమర్శిస్తూ, బీఆర్ఎస్ హయాంలో తీసుకువచ్చిన ఈ వ్యవస్థ పేదలకు, రైతులకు శత్రువుగా మారిందన్నారు. "కొండనాలుకకు మందు వేస్తే ఉన్ననాలిక ఊడినట్లు" ధరణి వల్ల సమస్యలు మరింత పెరిగాయని చెప్పారు. ధరణిని ప్రజలు మూడు సంవత్సరాల వ్యవధిలోనే తిరస్కరించారని, ఇప్పుడు అది చట్టం నుంచే లేకుండా పోయిందన్నారు. పేదల కన్నీటిని తుడిచేందుకు "భూభారతి 2025" చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఇది వందేళ్లకూ ఉపయోగపడేలా రూపొందించారని వివరించారు. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించేందుకు 10,954 రెవెన్యూ అధికారుల పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. త్వరలోనే వారు గ్రామాలకు చేరుకుని సేవలందిస్తారని తెలిపారు. 2020లో ధరణి చట్టం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి అయినా రెవెన్యూ సదస్సు నిర్వహించిందా? అని ప్రశ్నించారు. ప్రజల బాధలు తెలుసుకోవాలంటే ఇటువంటి సదస్సులు అవసరమని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అలా చేయలేదన్నారు. ఓ వీఆర్వోపై కోపంతో కేసీఆర్ ప్రభుత్వం మొత్తం 23 వేల మంది వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను రద్దు చేసి వారిని రోడ్డున పెట్టిందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూముల సంరక్షణ కోసం కనీసం ఒక్క అధికారిని పెట్టే అర్హత కూడా ఆ సమయంలో పాలకులకు లేదన్నారు.

భూభారతి చట్టం కింద 6 వేల మంది సర్వేయర్లకు లైసెన్స్ ఇచ్చి క్షేత్రస్థాయికి పంపనున్నారు. అధికారుల దుర్వ్యవహారాలపై ఫిర్యాదు చేసేందుకు పై అధికారికి లేదా కలెక్టర్ తప్పు చేస్తే ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అబాదీ భూముల్లో ఉన్న ఇళ్లకు డాక్యుమెంట్లు లేకపోయినా, ఈ చట్టం ద్వారా పరిష్కారం చూపుతామని చెప్పారు.

## 33 శాతం సీట్లు మీకే

**బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్**

హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించి వ్యూహాలు, కార్యాచరణ, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి పాత్ర వంటి అంశాలపై కేసీఆర్ తగిన సూచనలు చేశారు. దేశంలో త్వరలోనే మహిళా బిల్లు రాబోతున్నదని..బిల్లుతో మహిళలకు 33 శాతం సీట్లు వస్తాయని చెప్పారు.రాబోవు రోజుల్లో మహిళలంతా ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. రాజకీయాల్లో ప్రత్యక్షంగా తిరిగే మహిళలకే అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటి నుంచే నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. మహిళా బిల్లుతో రాష్ట్రంలో పార్టీ తరఫున 33 శాతం సీట్లు కేటాయిస్తామని.. నాయకుల భార్యలకు కాకుండా పార్టీలో యాక్టివ్‌గా పనిచేస్తున్న వారికే సీట్లు ఇస్తామని కేసీఆర్ చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో పెద్ద ఎత్తున మీటింగ్ పెడుతామని వెల్లడించారు.వారికి సైతం ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో మహిళలు ఎంతగానో క్రియాశీలక పాత్ర పోషించారని.. రజతోత్సవ సభలోనూ అలాంటి పాత్రనే పోషించాలని సూచించారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. సభ ముగిసే సరికి రాత్రి అవుతుందని.. ఎవరికి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఇందుకోసం ఎమ్మెల్సీ కవిత నేతృత్వం లో 8 మందితో కమిటీ వేస్తామని కేసీఆర్ చెప్పారు. మహిళల భద్రత పట్ల ఈ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ మౌనం ఎందుకు?

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్18(తొలి క్రాంతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి సీఎం రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులపై ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ఆయన సోషల్ మీడియా వేదికగా రేవంత్‌ను ప్రశ్నించారు.

సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లు ఈడీ చార్జ్ షీట్లో నమోదు కావడంతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు నిరసనలు చేపడుతున్నారని గుర్తుచేస్తూ, ఆ పరిస్థితుల్లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. "ఈ ప్రశ్న నాకు మాత్రమే కాదు, అందరికీ వస్తోంది" అంటూ సెటైర్ విసిరిన కేటీఆర్, రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయని సూచించేందుకు ఇదే ఉదాహరణ చాలునని తన ఎక్స్ ఖాతా లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో సోనియా, రాహుల్ పేర్లు చార్జ్ షీట్లో ఉండటంతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ధర్నాలు, నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీసు వద్ద కూడా టీఎస్ కాంగ్రెస్ నేతలు భారీగా ధర్నా నిర్వహించారు. కానీ, ఆ కార్యక్రమంపై రేవంత్ రెడ్డి స్పందించకపోవడాన్ని కేటీఆర్ ప్రశ్నార్థకంగా ఉద్ధరించారు.




ఓం శ్రీ మహాగణాధిపతయే నమః
శ్రీ వాగ్దేవి కళాపీఠం
వేద గణితం శిక్షణ - తరగతి
ప్రశంసా పత్రము
శ్రీ వాగ్దేవి కళాపీఠం అంతర్జాల అంతర్జాతీయ శిక్షణా తరగతిలో భాగంగా నిర్వహించిన వేద గణితం శిక్షణ తరగతిలో విద్యను అభ్యసించి, నిర్వహించిన పరీక్షలలో శ్రీ కుమారి/చిరంజీవి యస్. సాత్విక్ సాయి కుమారాచార్యులు ప్రథమ శ్రేణి శ్రేణిలో ఉత్తీర్ణులైనందుకు అభినందిస్తూ ఇస్తున్న ప్రశంసా పత్రం.
శ్రీమతి జి. సత్య
వేద గణితం శిక్షకులు
బ్రహ్మశ్రీ వెంపరాల వెంకటలక్ష్మీ శ్రీనివాసమూర్తి
శ్రీ వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకులు
సమస్త లోకాః సుఖినోభవంతు

# వేదగణితం లో ప్రతిభ కనబర్చిన సాత్విక్



అశ్వరావుపేట, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: వేదగణితం శిక్షణలో అశ్వారావుపేటకు చెందిన సిద్ధాంతపుసాత్విక్ సాయికుమారాచార్యులు ప్రతిభకనబర్చాడు. వాగ్గేవీ కళాపీఠం,విశాఖపట్టణం వారు గత 6 మాసాలుగా అంతర్జాతీయంగా అంతర్జాలంలో నిర్వహించిన శిక్షణ ను పొందాడు.శిక్షణానంతరం నిర్వహించిన పరీక్షలను వ్రాయగా గురువారం వెలువరించిన ఫలితాలలో ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది అత్యంత ప్రతిభను కనబర్చాడు. దీనికి సంబంధించిన ధృవపత్రాన్ని మెయిల్ ద్వారా వాగ్దేవీ కళాపీఠం వారు పంపించారు. ఈ సందర్భంగా వాగ్దేవీ కళాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట లక్ష్మీశ్రీనివాస మూర్తి, వేదగణితం శిక్షకురాలు జి.సత్య లు సాత్విక్ సాయికుమార్ కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

# దాహార్తి కేకలు

## అశ్వరావుపేట మండలంలో నీటి కొరత

### అల్లాడిపోతున్నప్రజలు, పట్టించుకోని పాలకులు

అశ్వరావుపేట, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: అశ్వరావుపేట మండలంలోని పలు గ్రామాలు నీటి కొరతతో అల్లాడిపోతున్నాయి. ప్రజలు బిందెలు చేతబట్టుకొని దాహానికి తగిన నీటికోసం నలుమూలలా చూస్తున్నా, అధికార యంత్రాంగం మాత్రం నిశ్చలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. గ్రామ పంచాయతీలకు నిధుల్లేకపోవడం, ఉన్న నిధుల వినియోగంపై పట్టింపులేకపోవడం, సంబంధిత శాఖల నిర్లక్ష్యం వంటి కారణాలతో సమస్యలు రోజురోజుకీ ముదురుతున్నాయి.

**మిషన్ భగీరథ ఆశలు అర్ధాంతరమే!**

పోటీగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం గ్రామాలకు నాణ్యమైన మంచినీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగినా, ఆ పథకం ఊపిరాడకుండా పోతోంది. కొన్నిచోట్ల అప్పుడప్పుడూ నీరు వచ్చినా, అది కూడా తాత్కాలికం. 'తలుక్కుమంటూ నీళ్లు వచ్చి మాయమవుతుంటే, బిందెలకే పరిమితం అవుతున్న పరిస్థితి.. మరి మా దాహాన్ని ఎవరు తీర్చాలి?' అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**చేతిపంపుల బోగసాలు ..మరమ్మత్తులు లేని మౌనం**

ఒకప్పుడు ప్రధాన నీటి వనరులుగా పనిచేసిన చేతిపంపులు ఈ రోజుల్లో జాడలే కనిపించడం లేదు. ఉన్నవి పనిచేయకపోవడం, మరమ్మత్తుల కోసం సంబంధిత అధికారుల ఎదుట ఆహ్వానాలు పెట్టినా స్పందన లేకపోవడం వల్ల, ప్రజలు నీటి కోసం నలిగిపోతున్నారు. మరమ్మత్తుల కోసం రోజులు, వారాలు వేచి చూసే పరిస్థితి నెలకొంది.



**పరిష్కారం కోసం ఎదురు చూపులు**

గ్రామస్తులు ప్రభుత్వాన్ని, సంబంధిత శాఖలను పదేపదే విన్నవించుకుంటున్నా, ఆ విజ్ఞప్తులకు స్పందించే వారు కనిపించడంలేదు. సమస్యలు గాలికొదిలేయడం పరిపాటిగా మారిపోయిందని మండలంలోని పలువురు వాపోతున్నారు. "నివాసితుల ప్రాథమిక అవసరం అయిన మంచినీటి సరఫరా వైపు అధికారులు దృష్టి సారించాలని, చేతిపంపుల మరమ్మత్తులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పరిష్కార మార్గం ఎప్పుడు?**

మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పరిస్థితులు మరింత దారుణంగా మారతాయని హెచ్చరిస్తున్నారు.
ప్రజలు ఎదుర్కొంటున్న దాహ సమస్యను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపి తక్షణమే నీటి సమస్యపై చర్యలు తీసుకుంటేనే గ్రామాలు బతుకు బండిని ముందుకు నడుపగలవని ప్రజలు కోరుతున్నారు.




# అందాల పోటీలను రద్దు చేయాలి

## మహిళా సంఘాల డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: మే 7 నుండి 31 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న 72వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కొత్తగూడెంలోని రైటర్ బస్తి ఐఎఫ్టియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. లక్ష్మి అధ్యక్షతన వివిధ మహిళా, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి వై. జానకి మాట్లాడుతూ, ప్రజలకు అవసరం లేని ఈ పోటీల కోసం ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు, యువత దృష్టిని మళ్లించేలా ఈ పోటీలు ప్రజల్లో "అందమే అన్నీ" అనే సందేశాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. అందం పేరిట మహిళలపై ఒత్తిడి పెరిగిందని, కాస్మొటిక్స్, సర్జరీల వాడకంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, తెలంగాణ లాంటి సంపన్న సంస్కృతి కలిగిన రాష్ట్రాన్ని అర్ధనగ్న ప్రదర్శనలతో కించపరిచే కార్యక్రమాలని ఆమె ఆక్షేపించారు. ఈ పోటీలను వ్యతిరేకిస్తూ మే 21న 'చలో కలెక్టరేట్' ధర్నా నిర్వహించనున్నట్లు సంఘాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు




# అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం

ములకలపల్లి, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కాలువ పిల్లర్ కూలిపోవడంపై మాస్ లైన్ పార్టీ మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆయన, పిల్లర్ కూలడం అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యా నికి నిదర్శనమన్నారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే ప్రాజెక్టును నిర్లక్ష్యంగా నిర్మించారని ఆరోపిం చారు. నేల పరిశీలన లేకుండా, నాణ్యత ప్రమాణా లను పాటించకుండా నాసిరకంగా నిర్మించడంతో ఏడాదికే పిల్లర్ కృంగి కూలిపోయిందని చెప్పారు. కాంట్రాక్టర్లు లాభాల కోసం నాసిరక మెటీరియల్ వాడారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కాలువ మరమ్మతులు వెంటనే ప్రారంభించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వానకాలానికి ముందు నిర్మాణం పూర్తవడంతో రైతులకు సాగునీరు అందించాలన్నారు.




# ఘనంగా జలగం వెంకటరావు జన్మదినం

పాల్వంచ, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: కొత్తగూడెం నియోజవర్గంలోని పాల్వంచలో జలగం యువసేన ఆధ్వర్యంలో కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు జలగం వెంకటరావు జన్మదిన వేడుకలు శుక్రవారం అత్యంత హర్షాతిరేకాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. సేవా కార్యక్రమాలతో కూడిన ఈ వేడుకలు స్థానిక ప్రజల మనసులు గెలుచుకున్నాయి. వేడుకల సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సభ్యులు కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్, ఇతర పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. అంతేకాక, పాల్వంచ కూడలిలో ఉన్న అవసరమయ్యే యాచకులకు కూడా ఆహారం అందజేసి మానవతా విలువలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా జలగం యువసేన నాయకులు మాట్లాడుతూ, "జలగం వెంకటరావు రాజకీయ జీవితంలో ప్రజల అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకొని పనిచేసిన మహానుభావులు. ఆయన చేసిన సేవలు పదేళ్ళు గడిచినా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి. ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం," అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో మంజూర్, మసూద్, బొల్లం భాస్కర్, శ్రీపాద సత్యనారాయణ, అప్పల నాయుడు, టైగర్, సమి, సురేష్ నాయక్, మురళీకృష్ణ, కొండపల్లి సీతారామయ్య, మౌలాలి, ఖాసిం, జల్లారపు నాగేశ్వరరావు, బిల్లా సుజిత్, బిల్లా శ్రీను, పెద్దిరాజు, మల్లికార్జున్, బూర్గుల సురేష్, అనంత్ లాకేష్, నరేష్, విజయ్, ఫక్రుద్దీన్, నిసార్ అహ్మద్, రాకేష్, అఖిల్, మంగీలాల్, నాని తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యకర్తలు జలగం వెంకటరావు స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని స్మరించుకున్నారు. యువతకు మార్గదర్శిగా నిలిచిన ఆయన జీవితం, సిద్ధాంతాలు తదుపరి తరం నాయకులకు ప్రేరణగా నిలవాలని పేర్కొన్నారు.



# నూతన వధూవరులకు మెచ్చా శుభాకాంక్షలు


దమ్మపేట, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన దమ్మపేట మండలంలోని రెడ్యాలపాడు గ్రామంలో నల్లగుల్ల రామారావు మరియు రమాదేవి దంపతుల కుమారుడు సాయివెంకట్ వివాహ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆశీర్వదించారు. వివాహ వేడుకలో గ్రామ పెద్దలు, రాజకీయ ప్రముఖులు, స్నేహితులు, బంధువులు భారీగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పల్లె పరిసరాల్లో ఉత్సవ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు అతిథులకు సాదరంగా ఆతిథ్యం అందిస్తూ, విచ్చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# జలగం వెంకటరావు జన్మదిన వేడుకలు

## -ఖమ్మం జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాల సందడి

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి పాలుపంచుకున్న సర్దార్ జలగం వెంగళరావు వారసుడిగా ప్రజల మద్దతు పొందిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు జన్మదిన వేడుకలు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిపారు. జలగం అభిమానులు గ్రామాల నుంచి పట్టణాల వరకు విస్తరించి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ ప్రత్యేక దినాన్ని జ్ఞాపకార్థంగా మలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహా అనేక ప్రాంతాల్లో జలగం అభిమానులు ఆసుపత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాలకు తనవంతు పాత్ర పోషించారు. అనేక చోట్ల కేక్ కటింగ్ చేస్తూ అభిమానులు ఉత్సాహంగా వేడుకలు జరిపారు. జలగం కుటుంబం రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన చరిత్ర గల కుటుంబం. రాజకీయాల్లో ప్రజలతో మమేకమై సేవ చేస్తూ ముందుకు సాగుతున్న జలగం వెంకటరావు ఆయురారోగ్యాలతో మరింత ఎదగాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే, రాబోయే రోజుల్లో మరింత ప్రభావవంతమైన నాయకుడిగా వెలుగొందాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జన్మదిన వేడుకలు మరోసారి జలగం కుటుంబం ప్రజల మనసుల్లో ఉన్న స్థానాన్ని రుజువు చేయగా, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించాయి.








# పేదల పెన్నిధి కె. ప్రసాద్ రెడ్డి

## -సేవా కార్యక్రమాలతో మానవతా మూర్తిగా నిలుస్తున్న నాయకుడు!

జహీరాబాద్, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పేదల కోసం అంకితభావంతో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె. ప్రసాద్ రెడ్డి, ఇప్పుడు మానవతా మూర్తిగా గుర్తింపు పొందుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుండే ఆయన, పేదల పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఆర్థిక సహాయంతో అందరి మనసులు గెలుచుకుంటున్నారు. తాజాగా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి పాత తాండలో చోటుచేసుకున్న ఒక శుభకార్యానికి కె. ప్రసాద్ రెడ్డి తనదైన దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం రోజు జరిగే రామావత్ కిషన్ – కవితబాయి దంపతుల కుమార్తె వివాహానికి సంబంధించిన ఆర్థిక అవసరాలను గుర్తించిన రెడ్డి, తన 'కేపిఆర్ సైన్యం' ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రత్యక్షంగా అందుబాటులో లేని సందర్భంలో కూడా, తన సైన్యాన్ని కార్యాచరణలో ఉంచి సేవల అందించడంలో ప్రసాద్ రెడ్డి మానవతా విలువలకు అద్దంపడుతున్నారు. ఇందుకు గ్రామస్తులు, తాండ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన దాతృత్వానికి నీరాజనలు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ వినోద్ కుమార్, తాండ నాయకుడు రామావత్ రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు రామావత్ మంగు, రామావత్ నర్సిములు, రామావత్ విజేందర్, రామావత్ సోమ్లా, రామావత్ గోపాల్, ప్రేమ్, బానోత్ మోహన్, రవి, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు. కేవలం జహీరాబాద్ నియోజకవర్గం మాత్రమే కాదు, మునిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కూడా కె. ప్రసాద్ రెడ్డి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని, పేదలపై తనకున్న బాధ్యతను నిర్విరామంగా నిర్వర్తిస్తానని కె. ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఇలా సేవలతోనే ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్న కె. ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకుడిగా ఎదుగుతున్నారు.



# 256 లబ్ధిదారులకు రూ.1.56 కోట్లు పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: పేదల ఆరోగ్య సేవలు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం హర్షణీయమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్బులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 256 లబ్ధిదారులకు రూ.1.56 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, సిఎంఆర్ఎఫ్ మంజూరులో వేగం పెంచాలని, రూ.60 వేలు సీలింగ్‌ను రద్దు చేసి పూర్తిస్థాయి సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాల అమలులో సాంకేతిక లోపాలు తొలగించి లబ్ధిదారులకు సమగ్ర సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





## రజతోత్సవ సభకు సిద్ధం

కొత్తగూడెం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: బీఆర్ఎస్ పాతికేళ్ల రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో భాగంగా, ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున గులాబీ దండు తరలిపోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, టిబిజికెఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ పిలుపునిచ్చారు. రామవరంలోని ప్రధాన రహదారి పక్కన స్వయంగా వాల్‌రైటింగ్ చేస్తూ సభకు ఉత్సాహభరితంగా సిద్ధమవ్వాలంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా జీవించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం నిజాం కాలం రాజరిక పాలన కొనసాగుతోందని విమర్శించారు. వాగ్దానాలు విస్మరించిన కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టమైందన్నారు. సభ విజయవంతం కోసం నియోజకవర్గం స్థాయి నాయకులు, కార్యకర్తలు కీలకంగా చొరవ చూపాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజా బాక్ష, మజీద్, పూర్ణ, పెంట్రాజ్, జనిత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గుండె నిండుగా గులాబీ జెండా పండుగ: చదువు అన్నారెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 18 తొలి క్రాంతి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ గుండె నిండుగా గులాబీ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి" అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి పాటుపడిందని, సంక్షేమ పథకాల అమలులో ముందున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజలను నిరాశపరిచిందని, ఇచ్చిన హామీలు అమలుకాని స్థితి నెలకొందని ఆయన విమర్శించారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, త్వరలోనే బీఆర్ఎస్ కు పట్టం కట్టే రోజులు వచ్చేయని విశ్వాసం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా గ్రామ గ్రామాన గులాబీ జెండాలు ఎగురవేసి, వేడుకలను పండుగలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## జగతికి శాంతి సందేశం ఇచ్చిన క్రీస్తు శిలువ దినం

**సామాజిక కార్యకర్త, లాయర్ కర్నే రవి సేవా కార్యక్రమం**



మణుగూరు, ఏప్రిల్ 18 (తొలి క్రాంతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని పీవీ కాలనీలో క్రైస్తవ సోదరీ సోదరులు నిర్వహించిన పాదయాత్రలో, సామాజిక కార్యకర్త, లాయర్ కర్నే రవి పాల్గొని ఉపవాస దీక్ష చేస్తున్న వారిలో సుమారు 300 మందికి ఫ్రూట్ జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "యేసు క్రీస్తు బాల్యంనుంచే ఆధ్యాత్మికతను అలవర్చుకుని, అణచివేతకు గురైన వర్గాలకు ఆత్మీయ ఆశ్రయం కల్పించారు. యూదుల పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని సులభతరంగా బోధించి క్రొత్త మార్గాన్ని చూపారు. ఆయన బోధనలు అప్పటి యూదు మత చాందసులకు, రోమా పరిపాలకులకు గుబులు కలిగించాయి. దాంతో ఆయనను శిలువవేశారు. కానీ చివరికి ఆయనే దైవ కుమారుడని విశ్వసించారు. అప్పటినుంచి క్రైస్తవం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది" అని పేర్కొన్నారు. ఈ సందేశం సమాజంలో శాంతిని, మానవతను పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు.

## నోటి దూల తగ్గించుకో అద్దంకి దయాకర్"

**- బీజేపీ నేత నిశిధర్ రెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశిధర్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అద్దంకి దయాకర్ తన నోటి దూషణను తగ్గించుకోవాలని సూచించారు. ఒకానొక సమయంలో కోమటిరెడ్డి బ్రదర్స్‌పై దుర్భాషలాడిన తర్వాత దయాకర్ ఏడాది పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే మార్గంలో నడిచే ప్రయత్నం చేస్తే ఈసారి రాజకీయ సన్యాసం తప్పదని హెచ్చరించారు. దయాకర్ ప్రధానమంత్రి మోదీపై చేసిన వ్యాఖ్యలు నీచ స్థాయి విషయాలు అని మండిపడ్డారు. విమర్శలు అవసరమే కానీ, అవి నైతికంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మోదీని "దేశానికి పెద్దన్న"గా అభివర్ణించిన విషయాన్ని గుర్తు చేస్తూ, దయాకర్ మాటలతో ఆయనకే అవమానం జరుగుతోందని పేర్కొన్నారు. "రా బే" అనేసే స్థాయి మాటలు తమకూ వస్తాయని, అవసరమైతే మరింత బలంగా స్పందించగలమన్న నిశిధర్ రెడ్డి, అయితే తమ బీజేపీ కార్యకర్తల ధ్యేయం రాజకీయ సంస్కృతి, దేశభక్తి, ప్రజాసేవ అని తెలిపారు. దయాకర్ బుద్ధిమార్చుకుని నోటి దూల తగ్గించుకోకపోతే, రాజకీయ భవిష్యత్తుకి తాళం పడుతుందంటూ హెచ్చరించారు.




# పసికందులకు ప్రమాదం.. అంగన్వాడీల దురావస్థ!

### అశ్వరావుపేట మండలంలో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకం

### పరిష్కరించండి.. చర్యలు చేపట్టండి



అశ్వరావుపేట, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: మండలంలోని అనేక అంగన్వాడీ కేంద్రాలు శిథిలంగా మారి చిన్నారుల భద్రతను తీవ్రంగా సంకటంలోకి నెట్టేస్తున్నాయి. శౌచాలయాల గుట్టలు, నీటి సరఫరాలో లోపాలు, ప్రహరీల లేకపోవడం వంటి సమస్యలతో అంగన్వాడీలు చీకటివాటికలుగా మారిపోతున్నాయి. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**వర్షం వస్తే చెరువు, వేసవి వేడి అయితే నీటి కొరత .. అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా మారింది.!**

వర్షాకాలంలో నీటితో నిండిపోయే అంగన్వాడీలు, వేసవిలో తాగునీటి కోసం ఎదురుచూస్తున్న చిన్నారుల దుస్థితి. మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్నా నీటి సరఫరా లేదన్నది గ్రామస్తుల వాదన. మరమ్మత్తుల అవసరం ఉన్న చేతి పంపులు పనిచేయకపోవడంతో పిల్లలు, బాలింతలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

**పిల్లలే కాక గర్భిణులూ ప్రమాదంలో .. ఆసుపాక అంగన్వాడీ కేంద్రం రోదన..**

సెంటర్లో ఉన్న అంగన్వాడీ ఆసుపాక-2 భవనం నిత్యం ప్రమాద సూచికలతో కనిపిస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు హాజరయ్యే ఈ కేంద్రానికి ప్రహరీ లేదు, శౌచాలయాలు మొక్కలతో నిండిపోయాయి. పారిశుద్ధ్య లోపాలు సర్పాల నివాసంగా మారే స్థితికి తీసుకెళ్తున్నాయి. ప్రజలు "ఇదేనా అభివృద్ధి?" అంటూ ప్రశ్నిస్తున్నారు.

**అంగన్వాడీ భవనాల దురవస్థపై అధికారులు మూగబోయారా?**

గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా, పనుల్లో పురోగతి కనిపించకపోవడం స్థానికులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. మౌనంగా ఉండే అధికారులు ప్రజల ఆవేదనను గమనించారా అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సమస్యలను ఎత్తిచూపినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు.

**"ఇదేం అభివృద్ధి?" ..శిథిలం అయిన అంగన్వాడీ భవనాలను చూస్తూ ప్రజలు ప్రశ్న..**

ఒకవైపు అభివృద్ధి నినాదాలు, మరోవైపు భవనాలు పెచ్చులు ఊడి పడుతున్నాయి. వాస్తవంగా చూస్తే ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లు మట్టిలో కలిసిపోయినట్లేనని ప్రజలు వాపోతున్నారు. చిన్నారులకు ఆహారం ఇచ్చే కేంద్రాల్లో శుభ్రత లేకపోవడం దారుణమని పేర్కొంటున్నారు.

**ప్రహరీలు లేని ప్రదేశాలు.. పిచ్చిమొక్కలతో నిండిన టాయిలెట్లు .. చిన్నారులకో ముప్పు..**

అంగన్వాడీలకు ప్రహరీలేమి చిన్నారుల రక్షణకు ముప్పుగా మారింది. టాయిలెట్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, పురుగులు, విషజంతువులు చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయి. తక్షణం శుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అంగన్వాడీల్లో పిల్లలకు గదులు లేవు.. నీళ్లు లేవు.. భద్రత లేదు**

చిన్నారులకు ఆటవేలుగు చేయాల్సిన కేంద్రాలు ఇప్పుడు ఆకస్మాత్తుగా మూసివేయాల్సిన అవసరం వచ్చిందా? అన్న స్థితి. కొన్ని చోట్ల గదులు పూర్తిగా ఉపయోగానికి అసాధ్యం, తాగుటకు నీళ్ల లేవు. పిల్లలు రోజూ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యం - పసికందుల మీద భారం!**

ప్రభుత్వం నిర్లక్ష్యంతో చిన్నారుల జీవితం ప్రమాదంలో పడుతోంది. మౌలిక వసతుల లేమితో కూడిన అంగన్వాడీ కేంద్రాలు నిత్యం చిన్నారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అభివృద్ధిపై శ్రద్ధ చూపని పాలకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారు.

**ఎన్నికల వాగ్దానాలు ఏమయ్యాయో? .. ప్రజలు అడుగుతున్నారు**

ఎన్నికల సమయంలో హామీలను ప్రకటించిన నేతలు ఇప్పుడు కనిపించటం లేదు. ప్రజలు "మీరు చెప్పింది మాటలు మాత్రమేనా?" అని ప్రశ్నిస్తున్నారు. టాయిలెట్లు, నీటి పైపులు, ప్రహరీలు అన్నీ మాటల్లోనే మిగిలిపోయాయన్నది ప్రజాభిప్రాయం.

**"ప్రతి ఓటుకు బాధ్యత ఉంటే.. ప్రతి చిన్నారికి భద్రత ఉండాలి" ప్రజల ఆవేదన**

వాగ్దానాల మీద ఆధారపడి ఓటేసిన ప్రజలు ఇప్పుడు చిన్నారుల పరిస్థితి చూసి ఆవేదన చెందుతున్నారు. "ఒక ఓటుకు విలువ ఉందంటే, ప్రతి చిన్నారి భద్రతకు విలువ ఉండాలి" అంటూ ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని కోరుతున్నారు.

**పరిష్కరించండి.. చర్యలు చేపట్టండి.!**

అంగన్వాడి భవనాల సమస్యలను సత్వరమే పరిష్కరించి చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంగన్వాడి భవనాలకు పసికందులకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితులు ఉన్నాయని, జర అధికారులు ప్రజాప్రతినిధులు నూతన ప్రభుత్వం జర దృష్టి పెట్టి సమస్యల పరిష్కారం కై చర్యలు చేపడితే బాగుంటుందని లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని ప్రజలు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### కూనంనేని సాంబశివరావు

### కొత్తగూడెంలో నూతన భవనాల ప్రారంభం

కొత్తగూడెం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో రూ.72 లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు నూతన భవనాలను ప్రారంభించి ప్రజలకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐటిడిఏ నిధులతో నిర్మించిన షబ్ సెంటర్, కమ్యూనిటీ హాళ్లు, ఇతర భవనాలు ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజల అవసరాలైన త్రాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వేసవి సమస్యల నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. తాజాగా రూ.10 కోట్లు విలువైన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం ముందుంచామని, త్వరలో వాటికి మంజూరు పొందనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యలేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఐటిడిఏ అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

ఖమ్మం, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు ఖమ్మం నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. శుక్రవారం ఆయన ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ లోటస్ హిల్స్ ప్రాంతంలో రూ.100 లక్షల టియుఎఫ్ఐడిసి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను తొలిగించి, పేదల్ని ప్రభుత్వం పథకాలతో ఆదుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందు పనులు పూర్తి చేయాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగర అభివృద్ధికి రాష్ట్రంతో పాటు కేంద్రం నుంచి నిధులు సమకూర్చుకున్నామని, పనులను వేగంగా పూర్తిచేయనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి 39వ డివిజన్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





## మెట్రో పోలీస్ డయాగ్నస్టిక్స్ సెంటర్ ప్రారంభం

పాల్వంచ, ఏప్రిల్ 18 తొలి క్రాంతి: పాల్వంచ పట్టణంలోని నటరాజ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన మెట్రో పోలీస్ డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మచ్చ కోరా శ్రీ, డయాగ్నస్టిక్స్ నిర్వాహకులు గోర్ల కృష్ణ, మచ్చ నాగార్జున, కోటయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, బండి అంబేద్కర్, పులి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 73వ రోజుకు డంపింగ్ యార్డ్ నిరసన

గుమ్మడిదల, ఏప్రిల్ 18 తొలిక్రాంతి:( పత్రిక ప్రతినిధి ప్రశాంత్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా స్థానికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 73వ రోజుకు చేరుకున్నాయి. ప్యారా నగర్ నల్లవల్లి పరిధిలో జరుగుతున్న ఈ నిరసనలో రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. దీక్షలో మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, రైతు నాయకులు సదానంద రెడ్డి, మద్ది బాల్ రెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, పోచుగారి మోహన్ రెడ్డి, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొని తమ నిరసన తెలిపారు. అలాగే, మాజీ సర్పంచ్ నరసింహా రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, జగ్గారెడ్డి బాల్ రెడ్డి, కాలకంటి బాల్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, మద్ది మోహన్ రెడ్డి, ఆయుబ్, నర్సింలు, బక్క సత్యనారాయణ సహా మండల జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ప్రతిపాదిత డంప్ యార్డు ప్రాజెక్టును రద్దు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

రామచంద్రపురం, ఏప్రిల్ 18 తొలిక్రాంతి: పటాన్చెరు నియోజకవర్గంలోని భారతి నగర్ డివిజన్ ముంబై కాలనీలో నివసిస్తున్న నిరుపేద వ్యక్తి సురకంటి బాలరాజు గత రాత్రి కాలు జారి పడటంతో తలపై గాయం అయ్యి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాలరాజు కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఖదీర్ మాట్లాడుతూ, "కుల, మత, పార్టీ భేదాలు లేకుండా ఎల్లవేళలా నిరుపేదలకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాను," అన్నారు. ఎవరికైనా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, తగిన సహాయాన్ని అందిస్తానని తెలిపారు.




## వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ

అశ్వారావుపేట, ఏప్రిల్ 18 (తొలి క్రాంతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా స్థానిక ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మదీనా మసీదు నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ, ముస్లింల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం బోర్డు బిల్లును సవరిస్తోందని ఆరోపించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఎస్కే వలి పాషా, ఎస్కే నజీర్, ఎండి ఆసిఫ్ అలీ, రహమత్, ముఖరం ఖాన్, ఎస్కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

## 4 వేల కోట్ల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి: ధనుంజయనాయుడు విజ్ఞప్తి



హైదరాబాద్, ఏప్రిల్ 18 (తొలి క్రాంతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు 30 లక్షల మంది ఇంజనీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మసీ, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి రూ.4000 కోట్ల ఫీజులు, హాస్టల్ మెస్ బిల్లులు, ఇంటి అద్దె, కరెంటు బిల్లులు బకాయిగా ఉన్నాయని ఆయన తెలిపారు. గత ఐదు నెలల హాస్టల్ మెస్ బిల్లులు, మూడు సంవత్సరాల ఇంటి అద్దె, ఒక సంవత్సరం కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల కారణంగా కాంట్రాక్టర్లు సరఫరా నిలిపివేయడం, హాస్టల్స్ మూతపడే పరిస్థితి తలెత్తుతుందన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు స్టైఫండ్ కూడా అందడం లేదని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం సమస్యలతో నిండిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని బకాయిలను చెల్లించాలని, విద్యార్థులను ఆదుకోవాలని ధనుంజయనాయుడు కోరారు.